

5న ఉపాధ్యాయుల దినోత్సవం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఈ నెల 5న ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా శ్రీవెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ నిమ్మల రామానాయుడు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కందుల దుర్గేష్ హాజరవుతున్నారన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఎంఎల్‌ఎలు, జిల్లా ఉన్నత స్థాయి అధికారులు పాల్గొంటారని, కలెక్టర్ అధ్యక్షతన ఏర్పడిన కమిటీ ఎంపిక చేసిన ఉపాధ్యాయులను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారంతో సత్కరిస్తారని తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు ముందుగా ఉదయం 8.00 గంటలకు హాజరు కావాలని సూచించారు.

కేసు పట్టు.. కమీషన్ కొట్టు..

- ఆర్‌ఎంపి, పిఎంపిల తీరు
- ఆసుపత్రులకు సిఫార్సులు
- 30 శాతం కమీషన్ వసూలు



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

వైద్యసేవలు వాణిజ్యపరం అయిపోయాయి. సేవ అర్థం మారిపోతోంది. రోగులకు సహాయం చేస్తున్నట్లు నటించి వారికే తెలియకుండా కొంతమంది సేవ ముసుగులో దండుకుంటున్నారు. ఫలానా వైద్యుని వద్దకు వెళ్లండి బాగా చూస్తారు.. తాను కూడా మాట్లాడతాను అని రోగికి చెబుతారు. దీంతో రోగి చాలా నమ్మకంతో వెళ్తాడు. అక్కడకు వెళ్లాక రోగం తగ్గుతుందో లేదో కాని ఆర్థికంగా దివాలా తీస్తున్నాడు. ఈ విధంగా కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రుల్లో కమీషన్ల దందా నడుస్తోంది. రోగి పెట్టే ఖర్చులో 30 శాతం సిఫారసు చేసిన వ్యక్తికి అందుతోంది. నగరంలోని ఒక కార్పొరేట్ ఆస్పత్రిలో అన్నిరకాల వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారు. చికిత్సకు వచ్చేవారిలో అక్కడి సేవలు చూసి నమ్మకంతో చేరే వారు అరుదు. ఆర్‌ఎంపిలు, ల్యాబ్ టెక్నీషియన్‌లు, గ్రామాల్లోని ఎఎన్‌ఎం, ఆశా వర్కర్లు సూచించిన వారే ఎక్కువగా వస్తుంటారు. రోగి తనకు సాయంగా ఆర్‌ఎంపిలు వస్తున్నారని భావిస్తుంటారు కానీ అక్కడయ్యే ఫీజులో 10 నుంచి 20 శాతం ఆ ఆర్‌ఎంపి ఖాతాకు వెళ్తాయట. అలాగని డబ్బులు చేతికి ఇవ్వరు. ప్రతి ఆర్‌ఎంపి బ్యాంక్ అకౌంట్ కార్పొరేట్ ఆస్పత్రి వద్ద ఉంటుంది. గతంలో ఫలానా డాక్టర్ దగ్గరకు వెళ్తే ఫలానా వైద్యం అందుతుందని ప్రజలకు ఒకరకమైన నమ్మకం. నేడు ప్రత్యేక వైద్య నిపుణుల పేరుతో కొత్త సంస్కృతి పుట్టుకొచ్చింది. ప్రాథమిక వైద్యం కోసం స్థానికంగా ఉండే ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్ల వద్దకు వెళుతుంటే.. వారు ముందస్తు బేరం కుదుర్చుకొని కార్పొరేట్ ఆస్పత్రుల వైద్యుల వద్దకు పంపిస్తున్నారు. ముందుగానే 'నాకింత' అని బేరం కుదుర్చుకుంటున్నారు. సంబంధిత కార్పొరేట్ ఆస్పత్రులు రోగి వద్ద పిండుకొని తమ వద్దకు పంపిస్తున్న వారికి కమీషన్లు ముట్టజెబుతున్నారు. జిల్లాలో 300కు పైగా ఆస్పత్రులు ఉన్నాయి. దాదాపు చాలా ఆస్పత్రుల్లో ఇలా పిఎంపిలు, ఆర్‌ఎంపిలు సిఫారసు చేసిన కేసులే వస్తుంటాయి. ఒపి, ఐపి, రోగికి ఆస్పత్రికి అయ్యే బిల్లులో 20 నుంచి 30 శాతం కమీషన్ల రూపంలో వెళుతోంది. దీంతో రోగికి అవసరమైన వైద్యం అందించే నిపుణుల వద్దకు కాకుండా కమీషన్లు అందించేవారి వద్దకు పంపి కాసులు దండుకుంటున్నారు. దీంతో ఖర్చు పెరుగుతుండగా.. రోగానికి తగ్గ వైద్యం అందక ప్రజలు భారీ మూల్యం చెల్లించుకుంటున్నారు. కార్పొరేట్ ఆస్పత్రులు, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఓపీ ధరల సూచిక బోర్డులు కనిపించడం లేదు. అటు వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణ లేదు. దీంతో ఓపీ ధరను పెంచి కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో ఓపీ టిక్కెట్ ధర రూ.100 లేదా రూ.200 ఉండేది. సామాన్యులకు కొంత అందుబాటులో ఉండేది. కొవిడ్ తరువాత పరిస్థితి మారిపోయింది. రూ.500 వరకూ పెంచేశారు. అత్యవసర విభాగాలకు సంబంధించి ఒపి అయితే రూ.700 నుంచి గరిష్టంగా రూ.1000 వరకూ పెంచేశారని రోగుల బంధువులు తెలిపారు. సాధారణ ఐసియు గది రోజుకు రూ.4000 నుంచి రూ.7000 వరకూ అద్దె వసూలు చేస్తున్నారు. ఆస్పత్రిలో ఉండే రోగులకు ఉదయం, సాయంత్రం రౌండ్స్‌లో తనిఖీ చేస్తున్నందుకు డాక్టరు ఫీజు రూ.2000 వరకూ వసూలు చేస్తున్నారు. సామాన్యుడు ఏదైన అనారోగ్య సమస్యతో ఆస్పత్రిలో చేరితే ఇల్లు గుల్ల కావాల్సిందే. కొందరు ప్రైవేటు వైద్యులు, ఆస్పత్రుల యాజమాన్యాలు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. ముఖ్యంగా అవుట్ పేషెంట్ (ఒపి) కార్డుల ధరలు చూస్తే రోగులకు బిపి వచ్చినంత పని అవుతోంది. జాతీయ వైద్యమండలి నిబంధనలకు నీళ్లొదిలి ఇష్టారీతిన వసూలు చేస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ఆర్‌ఎంపిలు, పిఎంపిలు సాయం అవుతారనుకుంటే వారు కమీషన్ల రూపంలో దండుకుంటున్నారు. గతంలో అవుట్ పేషెంట్ (ఒపి) టోకెన్ కాలపరిమితి 15 రోజుల వరకూ ఉండేది. సాధారణంగా వైద్యులు స్వల్పకాలానికి మందులు ఇస్తారు. వాటిని వాడి మరోసారి కలవాలని సూచిస్తారు. అప్పుడు 15 రోజుల్లో రెండోసారి వెళ్లినా ఒపి ఫీజు వసూలు చేసేవారు కాదు. కానీ ఇప్పుడు వారం రోజుల కాలపరిమితికి మాత్రమే ఒపి టోకెన్ అందిస్తున్నారు. పది రోజులకు తగ్గట్టు మందులు అందించి వాటిని వాడిన తరువాత మళ్లీ రావాలని సూచిస్తున్నారు. దీంతో ఆ టోకెన్ చెల్లుబాటు కావడం లేదు. మళ్లీ డబ్బులు కట్టి టోకెన్ పొందాల్సి వస్తోంది. దీనిపై రోగి బంధువుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఒక టోకెన్‌తో రెండుసార్లు వైద్యం అందేదని.. ఇప్పుడు టోకెన్ ధర పెరిగినా.. ఒకసారికి మాత్రమే పరిమితమవుతోంది. సీజనల్ జ్వరాలు విజృంభిస్తున్న ప్రస్తుత పరిస్థితులలో ఇటువంటి అక్రమ వసూళ్లపై వైద్యశాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

జిల్లాలో యూరియా కొరత లేదు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులెవరూ ఈ విషయమై ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఎరువులపై ప్రధాన కార్యదర్శి, డిజిపితో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నుంచి బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఎస్‌పి నరసింహ కిషోర్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ.. గత సంవత్సరం 21 వేల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయగా, ఈ ఏడాది 24000 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసామని, గతేడాది పోలిస్తే ఇది 3000 మెట్రిక్ టన్నులు అధికమని ముఖ్యమంత్రికి వివరించారు. ఈ క్రాప్ డేటాను అనుసరించి ప్రతి రైతుకూ రెండు యూరియా బస్తాలను అందజేస్తున్నామని తెలిపారు. సహకార సొసైటీల సహకారంతో రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా పంపిణీ జరుగుతోందని తెలిపారు. రద్దీ కలిగిన చోట రైతులకు ఇబ్బంది లేకుండా టోకెన్లు ఇస్తున్నామని ఆమె తెలిపారు. ప్రైవేట్ ద్వారా సరఫరా అవుతున్న ప్రాంతాలలో గ్రామ వ్యవసాయ సహాయకుల పర్యవేక్షణలో యూరియా అందిస్తున్నామన్నారు. సెప్టెంబర్ 5, 6 తారీకులలో 1,214 మెట్రిక్ టన్నుల యూరియా రానుందని తెలిపారు. సెప్టెంబర్ ఐదున 390 మెట్రిక్ టన్నుల కోరమండల్ యూరియా ద్వారపూడి స్టాక్ పాయింట్‌కు చేరుతుందని చెప్పారు. యూరియా విషయమై సమస్యలు ఉంటే 8977935611 నంబర్‌లో సంప్రదించాలని వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ, దళిత సంఘాల నాయకులు

నన్నయలో పొలిటికల్ సైన్స్ కొనసాగించాలి

ప్రజాశక్తి-రాజానగరం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో పొలిటికల్ సైన్స్ విభాగం కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన బుధవారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఆందోళన చేపట్టారు. దీనిపై రిజిస్ట్రార్ కెవి.స్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా మాట్లాడుతూ రాజమహేంద్రవరం క్యాంపస్‌లో పొలిటికల్ సైన్స్ విభాగంలో ఈ విద్యా సంవత్సరం ప్రవేశాలను నిలిపివేస్తూ యూనివర్సిటీ యాజమాన్యం చర్య తీసుకుందన్నారు. తక్షణమే వాటిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. దీనిలో ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు వై.భాస్కర్, నాయకులు కె.జ్యోతి, లహరి, హేమంత్, కార్తీక్, పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వి.రాంబాబు, దళిత సంఘం నాయకులు కోరుకొండ చిరంజీవి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, పి.వేణుగోపాల్, ఎన్.వెంకటరత్నం రాజు, జె.సత్తిబాబు, పిడిఎస్‌యు విజంభణ రాష్ట్ర కార్యదర్శి కె.సతీష్, ఉమ్మడి జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, రాజ్యాంగ పరిరక్షణ సమితి కన్వీనర్ మేకల లక్ష్మీపతిరావు పాల్గొన్నారు.

జాతీయ రహదారి పనులపై మంత్రి అసంతృప్తి

ప్రజాశక్తి-రాజానగరం

జాతీయ రహదారి మరమ్మతు పనులపై రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. విశాఖపట్నం నుంచి విజయవాడ వెళుతుండగా మార్గమధ్యంలో జాతీయ రహదారి దివాన్ చెరువులో పనులను మంత్రి జనార్ధన్ రెడ్డి బుధవారం పరిశీలించారు. జాతీయ రహదారి అధికారులు లేకపోవడం, పనుల్లో నాణ్యత నిర్మాణంపై సంబంధిత ప్రైవేట్ ఉద్యోగిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరికి ఘన సన్మానం

ప్రజాశక్తి-గోకవరం

మండల కేంద్రమైన గోకవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ఫార్మసీ అధికారిగా ఉద్యోగ విరమణ చేసిన కె.సుబ్రహ్మణ్యేశ్వరికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు రాయవరపు శ్రీనివాసరావు, అరుణ, మాజీ ఎంపిటిసి పులపర్తి బుజ్జి పాల్గొని ఘనంగా సన్మానించారు. ఆసుపత్రిలో డెంటల్ డాక్టర్ పావని తుని ఏరియా ఆసుపత్రికి బదిలీపై కావడంతో ఆమెను ఘనంగా సన్మానించారు.

రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని రంపయర్రంపాలెం రైతు భరోసా కేంద్రంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో పామాయిల్, మామిడి, జీడి మామిడి రైతులకు బుధవారం ఒక రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత సస్యరక్షణ అధికారి విజయ్ ప్రసాద్ పాల్గొని మామిడి, జీడి మామిడితోటలకు చేపట్టవలసిన యాజమాన్యంపై అవగాహన కల్పించారు. పతంజలి కంపెనీ టెక్నికల్ ఆఫీసర్ కార్తీక రెడ్డి, గ్రామ సహాయకులు నిహారిక సౌమ్య, సావిత్రి పాల్గొన్నారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ కన్వీనర్‌గా ఆంజనేయులు

ప్రజాశక్తి-దేవరపల్లి

ఎపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ గోపాలపురం నియోజకవర్గకమిటీ కన్వీనర్‌గా అనుమురెడ్డి ఆంజనేయులు నియమితులయ్యారు. ఇటీవల రాజమహేంద్రవరంలో నిర్వహిరంచిన జిల్లా సన్నాహక సమావేశంలో ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ యూనియన్ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

స్తంభించిన ట్రాఫిక్

ప్రజాశక్తి -కొవ్వూరు

కుమారదేవం ఇసుక స్టాక్ పాయింట్ వద్ద బుధవారం సాయంత్రం భారీగా ట్రాఫిక్ స్తంభించింది. ఇసుక రవాణా నిమిత్తం వచ్చిన వాహనాలు రోడ్లపైనే నిలిపివేయడంతో కిలోమీటర్ల తరబడి వాహనాలు నిలిచిపోయాయి. వందలాది వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకోవడంతో ప్రయాణికులు ఇబ్బందులను చవిచూశారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు

యూరియా కోసం పలుచోట్ల రైతులకు పడిగాపులు తప్పడం లేదు. ఎరువుల కేంద్రాల వద్దకు ఉదయం 9 గంటలకే వందలాది మంది రైతులు చేరుకుని బారులు తీరారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

గోపాలపురం యూరియా కొరతతో, స్టాకు అయిపోతే లోడు వచ్చేందుకు కనీసం వారం రోజులు పడుతుందని వచ్చిన స్టాకు తీసుకునేందుకు పెద్ద ఎత్తున ఎరువులు గొడౌన్‌ల వద్దకు రైతులు చేరుకుంటున్నారు. మండలంలోని కొవ్వూరుపాడు గొడౌను వద్దకు 12.6 టన్నులకు గాను 280 బస్తాల స్టాకు వచ్చింది. బుధవారం సుమారు 300 మంది రైతులు మందు బస్తాలు తీసుకోవడానికి రావడంతో అక్కడే పడిగాపులు పడ్డారు. ఆధార్, పాసుబుక్‌కు ఒక బస్తా మాత్రమే ఉదయం 10 గంటల నుంచి ఐదు గంటల వరకూ అందించారు. గోపాలపురం సొసైటీ వద్ద 280 బస్తాలు రాగా ఆధార్ పాస్ బుక్కుకు రెండు బస్తాలు చొప్పున అందించారు. బీమోలుకు 280 బస్తాలు రాగా ఒక ఆధార్‌కు రెండు బస్తాల చొప్పున అందించారు.

చాగల్లు సరిపడా యూరియా అందక రైతులు అగచాట్లు పడుతున్నారు. మండలంలోని ఊనగట్ల సహకార పరపతి సంఘం వద్ద వందల మంది రైతులు యూరియా కోసం పడిగాపులు పడుతున్నారని రైతు సంఘం కన్వీనర్ గారపాటి వెంకట సుబ్బారావు తెలిపారు. సొసైటీలో ఒక రైతుకు రెండు బస్తాల మించి ఇవ్వట్లేదని, పదెకరాలు కౌలు చేసే రైతు రెండు బస్తాలతో సరిపెట్టలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. రైతులకు సరిపడా యూరియా ఇచ్చేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు

సీతానగరం యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను మండల వ్యవసాయ అధికారి గౌరీ దేవి దృష్టికి తీసుకెళ్తున్నామని, వెంటనే యూరియా అందుబాటులోకి తెచ్చి రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో వ్యాపారులు యూరియా అడిగితే కాంప్లెక్స్ ఎరువులు లేదా గుళికలు కూడా తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని రైతులు అంటున్నారు. దీనివల్ల రైతులకు ఆర్థిక భారం పెరుగుతోందని, ఇలాంటి దుకాణాలపై విచారణ జరిపి, రైతులకు అవసరమైన ఎరువులను మాత్రమే అందించేలా చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరారు.



గోపాలపురంలో ఎరువుల కోసం రైతుల అవస్థలు

ఐక్యతతో ఉద్యోగుల సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-చాగల్లు

ప్రభుత్వంలో కీలక విధులు నిర్వర్తిస్తున్న సచివాలయ ఉద్యోగులు అనేక సమస్యలతో సతమతం అవుతున్నారని, వాటి పరిష్కారానికి ఉద్యోగులందరూ ఐక్యంగా ఉండాలని ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గిరి ప్రసాద్ వర్మ అన్నారు. బుధవారం చాగల్లు మండలంలో ఎపిజిఎ ఆధ్వర్యంలో నిర్వహించిన రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమానికి జొన్నకూటి శేషు బాబు అధ్యక్షత వహించారు. గిరి ప్రసాద్ వర్మ మాట్లాడుతూ, సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎపిజిఎ రాష్ట్ర అధ్యక్షుడు కెఆర్.సూర్యనారాయణ ప్రభుత్వం ముందు పలు ప్రతిపాదనలు ఉంచారని తెలిపారు. ప్రధానంగా, సచివాలయ ఉద్యోగులను వారి మాత శాఖలకు పంపించాలని కోరుతున్నట్లు ఆయన వివరించారు. ఈ విషయాలను ఉద్యోగులకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు చెప్పారు. అంతేకాక సచివాలయ ఉద్యోగుల నియామకం సందర్భంగా వారికి జూనియర్ అసిస్టెంట్ స్కేల్‌కు తగిన పోస్టులు కేటాయించాలని సూర్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారని పేర్కొన్నారు. 18 శాఖల్లోని సచివాలయ ఉద్యోగుల సీనియర్ లిస్టులు వెంటనే తయారు చేసి, వారికి తగిన కేడర్‌లకు తక్షణమే పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటికీ సచివాలయ ఉద్యోగులు ఐక్యం కావడం ఒక్కటే పరిష్కారమని ఆయన స్పష్టం చేశారు.ఈ సమావేశంలో పాల్గొన్న ఎపిజిఇఎ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.కమల్ సుందర్ మాట్లాడారు.

కార్టూ'నిజం'



జల్ జీవన్ మిషన్‌లో 3.30 లక్షల ఇళ్లకు కనెక్షన్లు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

భారత ప్రభుత్వ జల్ జీవన్ మిషన్ అదనపు జాయింట్ సెక్రటరీ సి.కమల్ కిషోర్ న్యూ ఢిల్లీ నుంచి జిల్లా కలెక్టర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ, తూర్పు గోదావరి జిల్లాలో దాదాపు 92 శాతం గృహాల వివరాలను ఐఎంఐఎస్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. పూర్తి చేసిన పనుల వివరాలు అప్లోడ్ చేసేందుకు 'ఐఎంఐఎస్' జిల్లా స్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ క్రమంలో నెలవారీగా డిస్ట్రిక్ట్ వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి వివరించారు. జూన్ 3, జూలై 8, ఆగస్టు నెలల్లో సమావేశాలు నిర్వహించి పనుల పురోగతిని సమీక్షించామని తెలిపారు. జిల్లాలో గ్రామ పంచాయతీ స్థాయిలో ఎస్‌హెచ్‌జి మహిళలను కన్సల్టెంట్లుగా నియమించి, స్వచ్ఛ భారత్ మిషన్, వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్, వ్యక్తిగత గృహాల లెట్రిన్లు, కమ్యూనిటీ సోక్ పిట్స్, శానిటరీ కాంప్లెక్స్‌లు, ఫీకల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు, నిత్య జల సరఫరా మానిటరింగ్ సిస్టమ్ పనులు ప్రగతిలో ఉన్నాయని కలెక్టర్ పి ప్రశాంతి చెప్పారు. జిల్లాలోని 865 పాఠశాలలు, 868 అంగన్‌వాడీ కేంద్రాలకు సురక్షితమైన తాగునీటి టాప్ కనెక్షన్లు అందజేసినట్లు తెలిపారు. ఎస్‌టి హౌస్‌హోల్డ్‌లలో 2,200 ఇళ్లకు సంబంధించి 80 శాతం కనెక్షన్లు ఇచ్చి, మిగిలిన వాటికి త్వరలో పూర్తి చేయనున్నట్లు వివరించారు. జిల్లాలో ఇప్పటికే రూ.144.38 కోట్లతో 491 పనులు పూర్తి చేసి గ్రామ పంచాయతీలకు అప్పగించామని, మరో రూ.24.75 కోట్లతో చేపట్టిన 48 పనులు పూర్తి కావడంతో త్వరలో వాటిని కూడా పంచాయతీలకు అప్పగిస్తామని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఈ సమీక్షలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఇ బివి.గిరి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి

ఫ్యాక్టరీ కాలుష్యంపై ఆర్‌డిఒ విచారణ

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని అన్నవరప్పాడులో ఆద్య సీఫుడ్స్ రొయ్యల ఫ్యాక్టరీపై గ్రామానికి చెందిన రైతు పొప్పొప్పు ఆరక సుబ్రమణ్యం పిజిఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారుని ఫిర్యాదుపై కొవ్వూరు ఆర్‌డిఒ రాణి సుస్మిత క్షేత్రస్థాయిలో విచారణ చేసి అగ్రికల్చర్ ఎఒ, మైనింగ్ పొల్యూషన్ అధికారులు ఎంక్వయిరీ చేసి దాని ఆధారంగా చర్య తీసుకుంటామన్నారు. ఫిర్యాదుదారుడు తనకున్న 40 సెంట్ల భూమిలో కొంతకాలంగా పంట వేయడం లేదని తెలిపారు. వీరి వెంట తహశీల్దారు కె.నిరంజన్, రెవిన్యూ అధికారి పావని, సిబ్బంది రైతులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయినిగా మంగా రాణి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

లాలా చెరువు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలు మోటూరి మంగా రాణి 2025 సంవత్సరానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికయ్యారు. ఈ మేరకు అధికారుల నుంచి ఉత్తర్వులు అందుకున్నట్లు మంగారాణి తెలిపారు. సెప్టెంబర్ 5వ తేదీ గురుపూజోత్సవం నాడు అమరావతిలో జరిగే రాష్ట్రస్థాయి కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ద్వారా ఆమె అవార్డు అందుకోనున్నారు. మంగా రాణిని జిల్లా విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు, అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్ కుమార్, అర్బన్ ఎంఇఒ-2 రమా రజని, పాఠశాల హెచ్‌ఎం యు.విజయలక్ష్మి, ఎస్‌ఎంసి చైర్మన్ కందికొండ రమేష్ తదితరులు అభినందించారు.

భూ సమస్యలకు పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి రాజమహేంద్రవరం రూరల్

పిడింగొయ్యిలోని సర్వే నెంబర్ 511 ప్రభుత్వ భూమిలోని శివాలయం, అంబేద్కర్ విగ్రహం ఉన్న ప్రాంతాన్ని ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆర్‌డిఒ ఆర్.కృష్ణనాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో భూ దోపిడీదారులు, కబ్జాదారులు రాజ్యం ఏలారని, నకిలీ డాక్యుమెంట్లు పుట్టించి, రూరల్ నియోజకవర్గంలో రూ.కోట్ల విలువ చేసే భూములను కబ్జా చేశారన్నారు. త్వరలో వాటన్నింటినీ రీసర్వే చేసి భూములను ప్రభుత్వం స్వాధీన పరుచుకుని, దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పిడింగొయ్యిలోని సుమారు 5 ఎకరాల ప్రభుత్వ భూమిపై ఇరువర్గాలు కోర్టును ఆశ్రయించడంతో సమస్య దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉందని, దీన్ని ఇళ్లు లేని బడుగు, బలహీన వర్గాల వారికి ఇళ్లు నిర్మించేందుకు కేటాయిస్తామన్నారు. ఎఎంసి చైర్మన్ మార్ని వాసుదేవ్, తహశీల్దార్ శ్రీనివాస్, మట్ట శ్రీను, ముప్పిడి రాంబాబు, చిచారి సుబ్బారావు, బత్తుల శివ, గడ్డం ప్రభుదాస్, రేలంగి సత్యనారాయణ, గడ్డం చిన్నారావు, రేలంగి సత్యం, దాసరి రాము, రాంబాబు, ముప్పిడి గణేష్, పంచకట్ల వీర్రాజు పాల్గొన్నారు.

ఉద్యోగుల సేవలను గుర్తుంచుకోవాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉద్యోగులు వేరే ప్రాంతానికి బదిలీపై వెళ్లిపోయినా, వారి సేవలు అందుకున్న ప్రజలు వారిని శాశ్వతంగా గుర్తుంచుకోవాలని దమ్మెన్ను సర్పంచ్ గురజర్ల వీర వెంకట సత్యనారాయణ అన్నారు. బుధవారం ఆబదిలీపై వెళ్లిపోయిన సచివాలయ ఉద్యోగులకు, ఆయన సతీమణి వెంకటలక్ష్మి నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డిజిటల్ అసిస్టెంట్ పాలూరి సుబ్రహ్మణ్యస్వామి, ఎఎన్‌ఎం, ఎస్ఎస్.నాగమణి, వెటర్నరీ అసిస్టెంట్ పామర్తి రామాంజనేయులు, మహిళా పోలీస్ నక్కా కౌసల్యాదేవి పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -కొవ్వూరు

15వ ఆర్థిక సంఘం నిధులు, సాధారణ నిధులు రూ.94 లక్షలతో వ్యయంతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు బుధవారం శంకుస్థాపన చేశారు. 18వ వార్డులోని ఆర్‌ఆర్ టౌన్‌షిప్‌లో సిసి రోడ్ సత్యవతి నగర్‌లో ఫైబర్ నెట్ ఆఫీస్ సమీపంలో సిసి రోడ్డు, నీటి పైప్ లైన్ నిర్మాణాలకు శంకుస్థాపన చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. 10వ వార్డులో క్రిస్టియన్ శ్మశాన వాటిక గ్రౌండ్‌లో సిసి రోడ్డు, బ్రిడ్జి పేటలో సిసి అప్రోచ్ రోడ్, పనులను ఎంఎల్‌ఎ ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, కమిషనర్ జి.సందీప్, బత్తి నాగరాజు, దాయన రామకృష్ణ, సూర్యదేవర రంజిత్, బర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పొలిటికల్ సైన్స్ విభాగంపై అపోహలు వద్దు

ప్రజాశక్తి-రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీ మెయిన్ క్యాంపస్‌లో పొలిటికల్ సైన్స్ విభాగం మూసివేస్తారంటూ వస్తున్న వార్తలు అవాస్తమని, పొలిటికల్ సైన్స్ విభాగం యథావిధిగా కొనసాగుతుందని రిజిస్ట్రార్ ఆచార్య కె.వి స్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్ విభాగం మూసివేస్తారంటూ, తరలిస్తారంటూ జరుగుతున్న ప్రచారం అవాస్తవమని అన్నారు. పొలిటికల్ సైన్స్ విభాగంలోని కొన్ని అంతర్గత సమస్యల కారణంగా ముందుగా 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్స్ తాత్కాలికంగా ఆపివేయడానికి ఒక ప్రతిపాదన చేసినప్పటికీ, తరువాత విద్యార్థుల అభ్యర్థనల మేరకు విభాగాన్ని యథావిధిగా కొనసాగించేందుకు నిర్ణయించుకున్నామన్నారు.

మెప్మా పీడీ కనకరాజు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా టి.కనకరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిను, డిపిఎం శ్రీదేవితో కలిసి మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ మెప్మా ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకుని సమయానికి పూర్తి చేయాలని సూచించారు. మహిళా మార్ట్, ఆన్‌లైన్ వేదికల ద్వారా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు మంచి ఆదరణ లభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

'సత్యసాయి' కార్మికులకు దక్కని జీతాలు

ప్రజాశక్తి - సీతానగరం

తూర్పు, పశ్చిమ గోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 80 గ్రామాలకు తాగునీరు అందిస్తున్న సత్యసాయి తాగునీటి పథకం కార్మికుల పరిస్థితి గందరగోళంగా ఉంది. గత నెలలో జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ, రాజానగరం ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ చొరవతో కార్మికులు తాత్కాలికంగా సమ్మె విరమించారు. నెల రోజులు గడిచినా వారికి ఇంకా జీతాలు అందలేదు. దీంతో కార్మికులు మళ్లీ సమ్మెకు సిద్ధమవుతున్నారు. కార్మికులకు రావాల్సిన 21 నెలల జీతాల బకాయిలను చెల్లిస్తామని అధికారులు హామీ ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదు.

తగ్గుముఖం పట్టిన గోదావరి వరద

ప్రజాశక్తి- కొవ్వూరు

గోదావరి ఎగువ ప్రాంతంలో నుంచి వచ్చే ప్రవాహ జలాలు తగ్గుముఖం పట్టడంతో నీటిమట్టం క్రమంగా తగ్గుతోంది. బుధవారం గోష్పాద క్షేత్రంలోని స్నాన ఘట్టాలు ఇంకా వరద ముంపులోనే ఉన్నాయి. ధవళేశ్వరం ఆనకట్ట వద్ద నీటిమట్టం బుధవారం సాయంత్రం 6 గంటలకు 10.70 అడుగులకు తగ్గింది. గంట గంటకూ నీటిమట్టం తగ్గుతోంది. గురువారం సాయంత్రానికి వరద ఉధృతి సాధారణ స్థితికి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

చమురు సంస్థలు వంతెనలను అభివృద్ధి చేయాలి



మాట్లాడుతున్న మంత్రి సుభాష్, పాల్గొన్న కలెక్టర్, ఎంఎల్ఎలు

ప్రజాశక్తి - అమలాపురం

ఓఎన్‌జిసి, గెయిల్ వేదాంత చమురు సంస్థలు తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్న బోరు బావులకు కేంద్రీకృత పైప్‌లైన్ కేంద్రాలకు వెళ్లే రహదారులలో భారీ వాహనాలు సంచరించేలా వంతెనల నిర్మాణ నిర్వహణ వ్యయాన్ని ప్రాజెక్ట్ వ్యయంలో కేటాయించి అభివృద్ధి పరచాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చమురు సంస్థల ప్రతినిధులకు సూచించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి గత రెండేళ్లుగా కార్పొరేట్ సామాజిక భద్రత కింద కేటాయించిన నిధుల వినియోగం రోడ్ల అభివృద్ధి గురించి చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇటీవల కాలంలో చమురు సంస్థలు తమ కార్యకలాపాలు స్థానికంగా నిర్వహించి లాభాలను ఆర్జిస్తున్నప్పటికీ ఈ ప్రాంత అభివృద్ధికి ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని స్పష్టం చేశారు. చమురు సంస్థలు ఈ ప్రాంత ప్రజానీకం శ్రేయస్సుకు కోరి ఏ ఒక్క అభివృద్ధి చేయని నేపథ్యంలో ప్రజానీకం పూర్తి అసంతృప్తిగా ఉన్నారన్నారు. అదేవిధంగా రహదారులు భారీ వాహనాల మూలంగా పూర్తిగా చెడిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తొలుత కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ కంపెనీల వారీగా గత రెండు సంవత్సరాల కాలంలో సిఎస్‌ఆర్ కింద మంజూరు చేసిన నిధులు వాటి వినియోగంపై సమీక్షించారు. ఈ సందర్భంగా రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులతో సిఎస్ ఆర్ నిధులు, స్థానిక ప్రాంత అభివృద్ధిపై కంపెనీల కార్యనిర్వాహక సంచాలకులతో నిర్వహించడానికి పలుమార్లు సమాచారం అందించినప్పటికీ కంపెనీల ఈడీలు అంతగా ఆసక్తి చూపడం లేదని స్పష్టం చేశారు. నియోజకవర్గ పరిధిలో సురక్షిత సరఫరా కొరకు ఐదు కోట్లతో ప్రాజెక్టు ప్రతిపాదించడం జరిగిందని నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని తెలిపారు. ఓఎన్‌జిసి సిజిఎం కెవికె.రాజు త్వరలో ప్రాజెక్టు ప్రారంభిస్తామని సమాధానమిచ్చారు. ఈ ప్రాంత అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం రోడ్లు వంతెనలు నిర్మించిందని ఈ రోడ్లపై చమురు కంపెనీల భారీ వాహనాలతో తిరగడం వల్ల వంతెనలు పూర్తిగా బలహీనమయ్యాయని ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. లూజ్ సాయిల్ వల్ల రోడ్లు పూర్తిగా బలహీనపడుతున్నాయని మా రాయని కంపెనీలు తమ ప్రాజెక్టు వ్యయంలో రోడ్లు వంతెనల నిర్మాణవ్యయాన్ని చేర్చి నిర్మించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వంతెనలు సామర్థ్యం భారీ వాహనాల రాకపోకలకు ఎంత మాత్రం సరిపోదన్నారు. బోరు బావులు తవ్వుతున్నచోట్ల నీటి పర్యావరణ వాయు కాలుష్యం వల్ల పంట పొలాలు దెబ్బతింటున్నాయని ఈ అంశంపై కూడా దృష్టి పెట్టాలన్నారు. పాశర్లపూడి సమస్యపై వెంటనే స్పందించి తగు నష్టపరిహారాలను అందించాలన్నారు. స్థానికంగా భూసార కండిషన్ పరిగణనలో తీసుకొని రోడ్లను ఉభయతారకమైన ప్రయోజనాలే లక్ష్యంగా బలోపేతం చేయాలని సూచించారు. పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ఎస్ యాసం పాయింట్ వద్దకు 20 సంవత్సరాలుగా వివిధ రోడ్ల నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయని రోడ్డు అధ్వానంగా తయారైందని అన్నారు. రూ.78 కోట్లతో రోడ్ల అభివృద్ధికి స్థానిక ఎంఎల్‌ఎ ప్రతిపాదనలు సమర్పించినప్పటికీ కంపెనీల నుండి ఏ విధమైన స్పందన లేదన్నారు. కంపెనీల నుంచి రోడ్ల మరమ్మతులు వంతెన నిర్మాణాలపై స్పందన లేని పక్షంలో అక్టోబర్ నెలాఖరు నుంచి వంతెనలపై భారీ వాహనాలు రాకపోకలు సాగించకుండా నిలుపుదల చేస్తామని ముక్తకంఠంతో తెలిపారు. అక్టోబర్ మొదటి వారంలో కంపెనీల ఈడీలు తప్పనిసరిగా ప్రజా ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ అధ్యక్షతన చర్చలకు రావాలని ప్రజా ప్రతినిధులు నిర్ణయించారు. వేదాంత వారు 1,50,000 కోట్ల మేర వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నారని కానీ బ్రిటిష్ కాలం నాటి వంతెనలు రోడ్లు పునర్నిర్మాణానికి ఈ ప్రాంత ప్రజానీకం శ్రేయస్సుకు ముందుకు రావడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. సిఎస్‌ఆర్ నిధులు అరకొరగా కేటాయిస్తూ స్థానిక ప్రజానీకం యోగ క్షేమాలను గాలికి వదిలేశారన్నారు. చమురు సహజ వాయువులను తరలించుకోవడం తప్ప, పొందిన లాభాలలో రెండు శాతం సిఎస్ ఆర్ నిధులు అందున్నాయని వాటిని కూడా పూర్తిస్థాయిలో కేటాయించడం లేదన్నారు. ఈ ప్రాంత వంతెనల రోడ్లు కంపెనీల రిగ్గులతో కూడిన భారీ వాహనాల రాకపోకలకు అనువుగా పూర్తి నాణ్యత ప్రమాణాలతో నిర్మించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పునరుద్ఘాటించారు. పాశర్లపూడి సంఘటన మూలంగా నష్టపోయిన పొలాలకు సంబంధించి మూడు పంటల నష్టపరిహారాన్ని అందించాలని త్రాగునీటిని కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సిఎస్ఆర్ కింద ఏడాదికి కనీసం 100 కోట్లు కేటాయించాలని సూచించారు. నగరానికి సంబంధించి 12 డిమాండ్లను పరిష్కరించాలని గెయిల్ వారికి సూచించారు. చమురు సహజ వాయువుల కంపెనీలు మౌలిక వసతులు కల్పనకు ముందుకు రాని పక్షంలో స్థానిక ప్రజానీకం ఉద్యమానికి సిద్ధంగా ఉన్నారని వారు స్పష్టం చేశారు. కొన్ని కంపెనీల వారు నేరుగా గ్రామపంచాయతీ అభీష్టానికి అనుగుణంగా జిల్లా కలెక్టర్ వారి ద్వారా ప్రతిపాదనలు పంపకుండానే నిధులు మంజూరు చేయడం సబబు కాదని ప్రతి ప్రతిపాదన నేరుగా కలెక్టర్ నుంచి రావాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయ పడ్డారు అదేవిధంగా ప్రతి అంశాన్ని స్థానిక ప్రజా ప్రతినిధి (ఎమ్మెల్యే) దష్టికి తేవాలని వారు సూచించారు. కరవాక గ్రామంలో మత్స్య కారులకు వలలు సరఫరా చేస్తామని చెప్పినప్పటికీ ఇప్పటివరకు అందించలేదన్నారు. రూ.5.25 కోట్ల ప్రతిపాదనలు కంపె నీలకు అందించినప్పటికీ అవి ఉన్నత స్థాయికి మంజూరు నిమిత్తం చేరడం లేదన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 550 బోరు బావులకు వెళ్లే రోడ్లకు మ్యాపింగ్ చేస్తూ, బ్రిటిష్ కాలం నాటి వంతెనలు బలహీనపడిన చోట్ల పునర్నిర్మించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సిఎస్ఆర్ కింద కేవలం సంక్షేమం విద్యా వసతులకు మాత్రమే అంతంత మాత్రమే కేటాయిస్తున్నారన్నారు. అక్టోబర్ మొదటి వారంలో నిర్వహించే సమన్వయ సమావేశానికి తప్పనిసరిగా కంపెనీలు కార్యనిర్వాహక సంచాలకులు హాజరుకావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు ఎ.ఆనందరావు, బండారు సత్యానందరావు, గిడ్డి సత్యనారాయణ, సునీల్‌కుమార్ ఓఎన్‌జిసి కాకినాడ మంజుందార్ జిఎం ఓఎన్‌జి సి రాజమండ్రి గెయిల్ ప్రతినిధులు ప్రభాకర్‌రావు, వేదాంత సిఎస్‌ఆర్ ప్రతినిధి సుమన్‌దేవ్, సిపిఒ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

తండ్రిని హత్య చేసిన కుమారుడు

ప్రజాశక్తి - కరప

మండలంలోని ఉప్పలంక గ్రామంలో క్షణికావేశంతో కన్న కొడుకే తన తండ్రిని హత్య చేసిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పలంకకు చెందిన కాలాడి సూర్యచంద్రరావు(50)కు నలుగురు కుమారులు. వీరిలో 3వ కుమారుడు మానసిక వ్యాధితో బాధపడుతుంటాడు. మానసిక రోగికి మందులు తీసుకురావాలని తండ్రి సూర్యచంద్రరావు తన రెండో కుమారుడు చంద్రశేఖర్‌కు మంగళవారం రూ.500 ఇచ్చాడు. ఆ డబ్బులతో మందులు తీసుకురాకుండా మద్యం తాగి రాత్రి 11.30 గంటల సమయంలో ఇంటికి రావడంతో చంద్రశేఖర్‌ను తండ్రి నిలదీశాడు. ఆగ్రహానికి లోనైన చంద్రశేఖర్ ఇంటి వద్ద ఉన్న గొడ్డలితో సూర్యచంద్రరావుపై దాడి చేశాడు. ఈ దాడిలో తండ్రి అక్కడికక్కడే మృతి చెందాడు. పెద్ద కుమారుడు ధనుంజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ టి.సునీత తెలిపారు.

పేకాడుతున్న 8 మంది అరెస్టు

ప్రజాశక్తి - సీతానగరం

పేకాడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ రామ్ కుమార్ తెలిపారు. మునికూడలి గ్రామ శివారులో పేకాడుతున్న వారిని అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుంచి రూ.11,360, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

60 శాతం స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ పూర్తి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

సచివాలయ సిబ్బందికి చౌక డిపో డీలర్లు సహకరించి కొత్త స్మార్ట్ రైస్ కార్డులను లబ్ధిదారులకు త్వరితగతిన అందజేయాలని తహశీల్దారు పిఎన్‌డి.ప్రసాద్ సూచించారు. మండలానికి 23,877 రైస్ కార్డులు మంజూరు కాగా, ఇప్పటి వరకూ 60 శాతం పైగా కార్డులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో రోజువారీ స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీని నిరంతర పర్యవేక్షణ చేస్తున్నట్లు తహశీల్దారు తెలిపారు.

చర్చిలో వైద్య శిబిరం నిర్వహణ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

గ్రేస్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఉండ్రాజవరంలో క్రీస్తు ప్రేమ సువార్త సంఘం చర్చిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు ఆ సంఘం ప్రెసిడెంట్ షారోన్ రాజు తెలిపారు. తణుకు పట్టణానికి చెందిన సన్ ఆసుపత్రి డాక్టర్ శోభాచరణ్ సుమారు వంద మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరికి మందులు ఉచితంగా పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంఘం వైస్ ప్రెసిడెంట్ టి.అబ్బులు, సెక్రటరీ యోనా బాబు పాల్గొన్నారు.

అక్షర ఆంధ్ర ఉల్లాస్ శిక్షణ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

అక్షర ఆంధ్ర ఉల్లాస్ మండల స్థాయి వాలంటీర్లకు స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం ఎంపిడిఒ వివివిఎస్.రామారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తహశీల్దారు పిఎన్‌డి.ప్రసాద్ హాజరై మాట్లాడారు. మండలవ్యాప్తంగా 9000 మంది నిరక్షరాస్యులు ఉన్నారని, మొదట విడతగా 2200 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు 220 మంది వాలంటీర్లను నియమించినట్లు తెలిపారు. ప్రతి వాలంటీర్‌కూ పది మంది నిరక్ష రాస్యులను కేటాయిస్తామని, వారికి 90 రోజులపాటు శిక్షణ స్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ టి.బాలకోటయ్య, ఎంఇఒ డి.శారదా జ్యోత్స్న, రిసోర్స్ పర్సన్ ఎల్ఎన్‌విఆర్ఎల్.మూర్తి పాల్గొన్నారు.

మండల కార్యాలయానికి కంప్యూటర్స్ అందజేత

ప్రజాశక్తి-బిక్కవోలు

ఎంపిడిఒ కార్యాలయానికి ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బుధవారం కంప్యూటర్స్, ఫర్నిచర్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ నిధులతో వీటిని కొనుగోలు చేసినట్టు తెలిపారు. అనంతరం ఉల్లాస్ కార్యక్రమాన్ని ఎంఎల్ఎ ప్రారంభించారు. ఉల్లాస్ శిక్షణా తరగతులకు హాజరైన వాలంటీర్లు బిక్కవోలు మండలంలో నిరక్షరాస్యులకు అవగాహన కల్పించి వారిని అక్షరాస్యులుగా చేసేందుకు కృషి చేయాలన్నారు. ఎంపిపి తేతలి సుమ పాల్గొన్నారు.

విష జ్వరాల నివారణకు వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-గోపాలపురం

విష జ్వరాలు ప్రబలకుండా గ్రామాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. బుధవారం మండలంలోని హుకుంపేట పిహెచ్‌సిని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో ఉన్న రికార్డులను, పలు రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ, విష జ్వరాలు ప్రబలకుండా గ్రామాలలో సచివాలయం వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. జ్వరాల రాకుండా అవగాహన కల్పించాలని తెలిపారు. ఆయన వెంట జిల్లా ఎపిడిమోలజిస్ట్ సుధీర్ బాబు, జాన్సన్, పిహెచ్‌సి వైద్యాధికారి బివివి.దుర్గ భవాని, సిహెచ్‌ఒ ఎస్.రూతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో ప్రోటోకాల్ పాటించడం లేదు

ప్రజాశక్తి-రాజానగరం

క్షేత్ర స్థాయిలో ప్రజా ప్రతినిధులకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వడం లేదని మండల సర్పంచ్, ఎంపిటిసిలు ఆరోపించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ ఎందుకు పాటించడం లేదని నిలదీశారు. మండల పరిషత్ హాల్లో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి మండారపు సీతారత్నం అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. కొత్తతుంగపాడు పంచాయతీ నిధులతో గ్రామంలో రహదారి నిర్మాణం ప్రారంభోత్సవానికి స్థానిక సర్పంచ్ ఎందుకు చెప్పలేదని మండల సర్పంచ్ సంఘం అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, మండల ఇంజనీరింగ్ అధికారి వినయ్‌ను నిలదీశారు. ప్రైవేట్ పాఠశాలలో నిరుపేద కుటుంబాల విద్యార్థులకు 25 శాతం ఉచిత విద్య అమలు చేస్తున్న వివరాలు తెలపాలని జెడ్‌పిటిసి వాసంశెట్టి పెద్ద విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. ఎంపిడిఒ జెఎ ఝాన్సీ, కోడి వీరఘవులు, డిటి తదితరులు పాల్గొన్నారు.

విదేశాలలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి వలసదారుల కేంద్రం సేవలు

ప్రజాశక్తి - అమలాపురం

నకిలీ ఏజెంట్ల చేతిలో మోసపోయి విదేశాలలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిని తిరిగి స్వదేశానికి రప్పించడమే లక్ష్యంగా వలసదారుల కేంద్రం సేవలు అందిస్తుందనికలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. ఆయన మాట్లాడుతూ బుధవారం మాట్లాడుతూ వలసదారుల కేంద్రం పనితీరు పూర్తిస్థాయిలో కొనసాగించే విధంగా డిఆర్ఒ, వలసదారులు కేంద్ర నోడల్ అధికారి కె.మాధవి నేతృత్వంలోని బృందం హైదరాబాదులోనీ ప్రొటెక్టర్ ఆఫ్ఇమిగ్రెంట్ కేంద్ర కార్యాలయానికి పూర్తి స్థాయి అధ్యయనం నిమిత్తం బయలుదేరి వెళ్లిందని తెలిపారు. విదేశాలలో స్థిరపడాలనుకునే వారు ఇప్పటికే నకిలీ ఏజెంట్ల చేతిలో మోసపోయి విదేశాలలో సరైన ఉపాధి లభించక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిని తిరిగి స్వదేశానికి రప్పించడంలో ఈ కేంద్రం కీలక భూమిక పోషించిందన్నారు. ఇకపై ఈ కేంద్రం మరింత మంది వలసదారులకు విదేశాలలో సుస్థిరమైన ఉద్యోగ అవకా శాలు కల్పించే విధంగా పని చేస్తుందనికలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.



రామచంద్రపురంలో జెఎసి ఆధ్వర్యంలో నిర్వహించిన నడక యాత్ర

కాకినాడ జిల్లాలో విలీనం కోసం జెఎసి నడకయాత్ర

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల పక్ష జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం నడకయాత్ర నిర్వహించారు. కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా మైదానంలో ప్రారంభమైన ఈ యాత్రలో యోగ వాకర్స్, స్థానిక ప్రజలు, వివిధ రాజకీయ, సామాజిక సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జెఎసి కన్వీనర్ మాగాపు అమ్మిరాజు, కో-కన్వీనర్ బి.సిద్ధూ, సీనియర్ న్యాయవాది దొమ్మలపాటి సత్యనారాయణ, జనసేన పట్టణ అధ్యక్షులు గొల్లపల్లి కష్ణ, పాస్టర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విక్టర్ నంద, కౌన్సిలర్లు అంకం శ్రీను, పి.మధు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఆర్‌డి.ఖాన్, తదితరులు నేతృత్వం వహించారు. వారు మాట్లాడుతూ అమలాపురం జిల్లా కేంద్రం రామచంద్రపురం నుండి 60 కి.మీ. దూరంలో ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లా కేంద్రం కేవలం 25 కిమీ. దూరంలో ఉండి అన్ని వనరులు అందుబాటులో ఉన్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వం వెంటనే రామచంద్రపురాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మందపల్లి చిట్టిబాబు, యోగ వాకర్ సభ్యులు కె.చంద్ర శేఖర్, గిరి, పరశువేది బాబ్జి , తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంజయ్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - మండపేట

ఎమ్ఆర్‌పిఎస్ రాష్ట్ర వ్యవస్థాపకులు బుంగ సంజయ్ పుట్టిన రోజు పురస్కరించుకుని ఒకరోజు ముందుగానే నిర్వహించారు. మండపేటలో బుధవారం సంజయ్ నివాసం వద్ద నిర్వహించిన వేడుకల్లో మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు ఈ నెల 4 న సంజయ్ పుట్టిన రోజు వేడుకల కోసం మండపేటలో అభిమానులు పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారని అన్నారు. గురువారం పుట్టినరోజు కార్యక్రమానికి మంత్రి హాజరుకావాల్సి ఉన్నప్పటికీ బిజీ షెడ్యూల్ కారణంగా రాలేకపోవడంతో ముందుగానే హాజరయ్యారన్నారు. మండపేట మాజీ మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు వర ప్రకాష్, సంజయ్ కుటుంబ సభ్యులు సన్నిహితులు మధ్య మంత్రి సుభాష్ కేక్‌కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మాదిగ వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి దొరబాబు, 7వ వార్డు కౌన్సిలర్ సవరపు సతీష్, బుంగ సునీల్ దత్తు, వేమగిరి లింగమూర్తి, సిరా శ్రీను, లంక ముత్యాలురావు, ముమ్మిడివరపు త్రిమూర్తులు, ముమ్మిడివరపు నారాయణ, తొత్తరమూడి ఇశ్రా యేల్, మందపల్లి శ్రీనుబాబు, తాతపూడి వీర్రాజు, యార్లగడ్డ అశోక్, లంక రాణా, మోరంపూడి విజయ్ కుమార్ తదితరులు, పాల్గొన్నారు.


మండపేటలో కేక్ కట్ చేసి సంజయ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి సుభాష్

డిసిసి అధికార ప్రతినిధిగా కిరణ్‌కుమార్

ప్రజాశక్తి - కాట్రేనికోన

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధిగా కంచుస్తంభం కిరణ్‌కుమార్(సోనీ) నియమితులయ్యారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్. షర్మిల ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. 2001వ సంవత్సరం నుంచి సోనీ కాంగ్రెస్ పార్టీలో పని చేశారు. కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వచ్చేలా తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా సోనీ పేర్కొన్నారు.

మృతుల కుటుంబాలకు పొన్నాడ పరామర్శ

ప్రజాశక్తి - కాట్రేనికోన

ఇటీవల కాలంలో మతి చెందిన పలువురు వైసిపి కుటుంబ సభ్యులను మాజీ ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ బుధవారం పరామర్శించారు. మండల పరిధిలోని కందికుప్ప గ్రామంలో పిత్యయోగంతో బాధపడుతున్న మండల వైసిపి సోషల్ మీడియా కన్వీనర్ కాశీ భరత్ కుటుంబసభ్యులను, పల్లం పంచాయతీ పరిధిలోని గోపాలరావుపేట గ్రామానికి చెందిన అయితా బత్తుల అప్పలస్వామి మృతి చెందడంతో వారి కుమారుడు రవిని పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట ఎంపిపి కోలాటి సత్యవతి సత్యం, జడ్‌పిటిసి సభ్యుడు నేల కిషోర్ కుమార్, సర్పంచుల సమైక్య మండల అధ్యక్షులు గంటి సుధాకర్, పార్టీ మండల కన్వీనర్ నల్ల నరసింహమూర్తి, ఏడిద లక్ష్మణరావు, సుబ్బారావు, పథ్వీ, నరేష్, రాంజీ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఎంఎల్ఎ బండారు పరామర్శ

ప్రజాశక్తి - రావులపాలెం

ఈతకోటలో డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం జరిగిన సంఘటనలో బాధితులను బుధవారం ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పరామర్శించారు. ఈ ఘటనలో గాయపడిన చిన్నారిని ఆసుపత్రిలో మరో ఇరువురు బాధితులను ఈతకోట ఆయన పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బండారు మాట్లాడుతూ జరిగిన సంఘటనను ఖండిస్తున్నానని అన్నారు. ఘటనకు పాల్పడిన ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

అన్నపూర్ణ సేవా సంస్థ వార్షికోత్సవం

ప్రజాశక్తి - రావులపాలెం


నిత్యావసర వస్తువులు అందజేస్తున్న చిర్ల జగ్గిరెడ్డి

స్థానిక కాశీ అన్నపూర్ణ సేవా సంస్థ వార్షికోత్సవంలో జిల్లా వైసిపి అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పాల్గొన్నారు. స్థానిక వేమన రెడ్డి కళ్యాణ మండపంలో జరిగిన శ్రీ కాశీ అన్నపూర్ణ సేవా సంస్థ 3వ వార్షికోత్సవం లో ఆసంస్థ సభ్యులు, జిల్లా వైసిపి అధ్యక్షుడు జగ్గిరెడ్డి పాల్గొని అభినందనలు తెలిపారు.. కాకినాడ జిల్లా కరప మండలం వేములవాడ గ్రామానికి చెందిన గుత్తుల శివకృష్ణ తలలో రక్తం గడ్డ కట్టి ఆపరేషన్ జరిగి వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్న బాధితునికి రూ.11,500 చెక్కును సంస్థ ద్వారా జగ్గిరెడ్డి అందించారు. అనంతరం 50 మంది పేద వద్ధులకు ఒక్కొక్కరికి దాదాపు రూ.1500 విలువగల నిత్యావసర కిరాణా సరుకులు, చీరలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం సంస్థ నిర్వాహకులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, కర్రి అశోక్ రెడ్డి, పితాని రాంబాబు, సుధాకరరెడ్డి ,శ్రీకాశీ అన్నపూర్ణ సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.


కోటిపల్లి రేవులో స్నాన ఘట్టాల వద్ద మేట వేసిన సిల్ట్

వరద తగ్గింది.. బురద మిగిలింది

ప్రజాశక్తి - రామచంద్రపురం

గోదావరి వరద నీటి ప్రవాహం బుధవారం తగ్గుముఖం పట్టింది. సుమారు 5 అడుగుల మేర వరద ప్రవాహం తగ్గడంతో కోటిపల్లి రేవులో మునిగిపోయిన స్నాన ఘట్టాలు బయట పడ్డాయి. అయితే గోదావరి వరద నీరు ప్రవాహం తగ్గినప్పటికీ వరదతో కొట్టుకొచ్చిన బురద, మట్టి రేవులో పేరుకుపోయాయి. దీంతో రేవులో ప్రయాణాలు సాగించేందుకు, గోదావరిలో స్నానాలు చేసే యాత్రికులకు ఇబ్బందికరంగా మారింది. మొత్తం సిల్టు తీస్తే గాని రేవు ప్రయాణికుల రేవు, స్నాన ఘట్టాలు ఉపయోగంలోకి రావు. కోటిపల్లి రేవు తిరిగి ఎప్పుడు ప్రారంభమవుతుందోనని ఇటు రామచంద్రపురం నియోజకవర్గ వాసులు, అటు అమలాపురం నియోజకవర్గ వాసులు ఎదురుచూస్తున్నారు.

పలు రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలో అభివృద్ధి పనులలో భాగంగా 3వ వార్డులో రూ.10.60లక్షల, గ్రావెల్ రోడ్డుకు కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శంకు స్థాపన చేశారు. బుధవారం జరిగిన ఈకార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, శ్రీవాసంశెట్టి సత్యం, మున్సిపల్ కమిషనర్ కెవిఆర్.రాజు కూటమినాయకులు పాల్గొన్నారు

వివాదాస్పద ఫ్లెక్సీలపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి -మామిడికుదురు

జిల్లాలో వివిధ ప్రాంతాల్లో వివాదాస్పదమైన వాఖ్యలతో ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీల పై చర్యలు తీసుకోవాలని మండల అంబేద్కర్ యువజన సంక్షేమ సంఘం, ఎంఆర్‌పిఎస్, వివిధ ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు అప్పనపల్లిలో వివాదాస్పదమైన వ్యాఖ్యలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన నేపథ్యంలో బుధవారం నగరం పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహించారు జిల్లా వ్యాప్తంగా రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, సినీ హీరోల అభిమాన సంఘాలు వివాదాస్పద వాఖ్యలతో ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు కొన్ని కులాలను కించపరిచేలా, రెచ్చగొట్టే విధంగా ఉన్నాయన్నారు ఈ తరహా ఫ్లెక్సీలు ప్రింటింగ్ చేస్తున్న వారిపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు దీనిపై నగరం ఎస్ఐ చైతన్య కుమార్, తహశీల్దార్ సునీల్ కుమార్‌లకు వినతి పత్రాలు అందజేశారు ఈ ఆందోళనలో నల్లి శ్రీనివాస్, గెడ్డం వెంకటేశ్వరరావు,కలిగితి పళం రాజు, బొంతు చందు, బత్తుల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఉపాధ్యాయ సంక్షేమానికి పిఆర్‌టియు కృషి చేస్తూ ఉంటుందని పిఆర్‌టియు అధ్యక్షుడు నరాల కృష్ణ కుమార్ అన్నారు. మండలంలోని పలు హైస్కూల్లో బుధవారం ఆయన పర్యటించి సభ్యత్వ శాఖలను సాధారణ నిధిని ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో సేకరించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయని అనుకున్నామని కానీ ఇంతవరకు ఒక్క.. డిఎ కూడా విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వ స్పందించి డిఎను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉపాధ్యాయులపై పరీక్షల పేర్ల పడుతున్న ఒత్తిడిని తగ్గించాలని బోధనపై ఎక్కువ సమయం కేటాయించేలా ఉండాలని ఆయన సూచించారు.

శతాధిక వృద్ధుని మృతి

ప్రజాశక్తి - మామిడికుదురు

బి.దొడ్డవరానికి చెందిన శతాధిక వృద్ధుడు వాకపల్లి వెంకటరత్నం(100) మంగళవారం రాత్రి మృతి చెందారు ఆయనకు ఆరుగురు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం కాగా, 18 మంది మనుమలు, 28 మంది ముని మనుమలు, పదిమంది అని మనుమలు ఉన్నారు. ఆయన చనిపోయే వరకు అతని పనులు అతనే చేసుకునేవారని కుటుంబ సభ్యులు తెలిపారు .అతనికి ఏ విధమైన అనారోగ్య సమస్యలు లేవన్నారు

వృద్ధుని కోసం కొనసాగుతున్న గాలింపు

ప్రజాశక్తి - మామిడికుదురు

బి.దొడ్డవరంలో మంగళవారం గోదావరిలో కాలుజారి గల్లంతయిన ఒలుపు కార్మికుడు రవణం సాయిబాబా కోసం బుధవారం కూడా గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు 15 మంది మూడు బోట్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. అయితే ఇంకా వృద్ధుడి ఆచూకీ లభించలేదు. తహశీల్దార్ సునీల్ కుమార్, ఎస్ఐ జి.సోమేంద్రలు గాలింపు చర్యలు పర్యవేక్షించారు. ఈ ఘటనపై సాయిబాబా కుమారుడు ఫిర్యాదు మేరకు నగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో బుధవారం రైతు సేవాకేంద్రాల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంపై రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. అనంతరం ఎలుకల నివారణకు మందు తయారీని వివరించారు.

రామచంద్రపురం : మండలం అన్ని రైతు సేవ కేంద్రాలలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో రైతులందరికీ బ్రోమోడయోలిన్ మందును 100 గ్రాముల విషపు ఎర తయారీకీ 96 గ్రాముల నూకలు, 2 గ్రాముల బ్రోమోడయోలిన్ మందు, 2 గ్రాముల నూనె కలిపి 10 గ్రాముల చొప్పున పొట్లాలు తయారు చేయడంపై రైతులకు అవగాహన కల్పించారు. ఎలకల వలన కలిగే నష్టాన్ని మండల వ్యవసాయ అధికారి టీవీ ఆర్ మణిదీప్ వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారి, మరియు ప్రజాప్రతినిధులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు , రైతులు పాల్గొన్నారు. కె.గంగవరం మండలం లోని అన్ని రైతు సేవ కేంద్రాల్లో బుధవారం సామూహిక నిర్మాణ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నాగేశ్వరరావు, విఎఎ సత్యనారాయణ మరియు రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. **ఆలమూరు :** రైతులు వరిలో ఎలుకల నివారణను సమిష్టిగా కషి చేస్తే దిగుబడులు పెంచవచ్చని చింతలూరు నీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్ చౌదరి అన్నారు. పెదపళ్ళ పంచాయితీ వద్ద వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎలుకల నివారణ మందును బుధవారం ఆయన రైతులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏడిద సత్య శ్రీ మెహర్ ప్రసాద్, కార్యదర్శి వి.వేణి, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం:** మండలంలోని రైతు సేవా కేంద్రాల వద్ద బుధవారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎలుకల మందును పంపిణీ చేశారు వ్యవసాయ అధికారి బి.రవి, సొసైటీల చైర్మన్లు,వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు, పాల్గొన్నారు.


టేకి రైతు సేవా కేంద్రం వద్ద ఎలుకల మందు పంపిణీ ఎఒ రవి